క్లుప్తంగా

రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేయాలి



మంగళగిరి టౌన్: రాష్ట్రం యూనిట్‌గా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలు జరపాలని ఎంఆర్‌పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య తెలిపారు. పట్టణంలోని ఐబీఎన్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లా యూనిట్‌గా వర్గీకరణ అనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలన్నారు. నాయకులు ఏటుకూరి విజయ్ కుమార్, చిలువూరు నాగరాజు, కిన్నెర నాగరాజు, ఈపూరి ఆదాం, కొమరాల శ్రీనివాసరావు, పులి దాసు, వి.భూషణం తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు మూడు కేంద్రాలు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో పదోతరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో గురువారం ఎంఈవో షేక్ మహబూబ్ సుబాని ఆ కేంద్రాన్ని పరిశీలించారు. మొత్తం 650 మంది పరీక్షలకు హాజరు కానున్నట్లు తెలిపారు. తాగునీరు, విద్యుత్తు తదితర సదుపాయాలు ఉండేలా చర్యలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం శౌరయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

పోషక విలువలతో ఆరోగ్యం



ఫిరంగిపురం: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యం చేకూరుతుందని వైద్యురాలు శ్వేత అన్నారు. మండలంలోని వేములూరిపాడు గ్రామంలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. వేసవి కాలం రావడంతో గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలన్నారు. 189 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, సూపర్‌వైజర్ అబ్దుల్ రెహమాన్, ఎంపీహెచ్ డబ్ల్యూ మేల్ బాబురావు, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఏఎన్ఎం అంతోనిరాణి, ఆశాకార్యకర్తలు సుజాత, పద్మ, శాంతరాణి, శాంతకుమారి, జోజమ్మలు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో పూజలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సాయినాథ ఆలయంలో గురువారం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విశేష పూజలు చేశారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ ఆరాధన, అష్టదిక్పాల పూజలు వేదపండితులు నారాయణం ప్రసాదాచార్యులు, వంశీకృష్ణలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాన్ని అర్చకులు నరసింహమూర్తి, అజయ్‌కుమార్‌లు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజాకార్యక్రమాల్లో ఆలయ పాలకమండలి చైర్మన్ వై.యల్లారెడ్డి, రమాదేవి దంపతులు పాల్గొన్నారు.

కండ్రికలో గాలికుంటు వ్యాధి టీకాలు

ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామంలో 76పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు నుదురుపాడు పశువైద్యాధికారి పీర్ అహ్మద్ గురువారం తెలిపారు. గాలి కుంటు వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పశువులకు టీకాలు వేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట వైద్యసిబ్బంది ఉన్నారు.

ముగిసిన వర్క్‌షాప్

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్క్‌జీఐఎస్ సాఫ్ట్‌వేర్‌తో స్పెషల్ విశ్లేషణపై నిర్వహించిన వర్క్‌షాప్ ముగిసిందని ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో సాఫ్ట్‌వేర్ వాడకంపై శిక్షణ అందించినట్లు చెప్పారు. రిసోర్స్ పర్సన్లు రాజు వెంకటరమణ, ఎస్‌డీవీవీఎల్ సర్వే అండ్ కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ జీఎస్ ప్రాదేశిక విశ్లేషణ రంగ నిపుణులు నెలవేణి తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు మందుబాబులు అరెస్ట్

మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు టేకుతోట వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్న ఐదుగుర్ని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ వెంకట్ తెలిపారు. గురువారం రాత్రి డ్రోన్ గస్తీ నిర్వహించగా వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఆగని అక్రమ మైనింగ్ దందా

- హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి టీడీపీ నాయకులు దోపిడీ
- కొండల్ని పిండిచేసి భారీగా గ్రావెల్, కొండరాళ్లు తరలింపు
- అధికారిక క్వారీ సొసైటీ ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ఎట్టకేలకు స్పందన



లాంలో అక్రమంగా లోడింగ్ చేసి తరలిస్తున్న గ్రావెల్, కొండరాళ్లు

తాడికొండ: తాడికొండ మండలం లాం గ్రామంలో అక్రమ మైనింగ్ దందా రెక్కలు విప్పుకుంది. రేయింబవళ్లు కొండల్ని పిండిచేసి గ్రావెల్, కొండ రాళ్లు, కంకర భారీగా తరలిస్తున్నారు. జనావాసాల మధ్యలో అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ నిర్వహించి కొండరాళ్లను సైతం పగలగొట్టి జరుగుతున్న ఈ అక్రమ మైనింగ్‌మాఫియా వెనుక అధికార పార్టీ అండదండలు పుష్కలంగా ఉండటంతో అధికార యంత్రాంగం కన్నెత్తి చూడటం లేదు. మామూళ్ల మత్తులో జోగుతూ ఫిర్యాదులు చేసిన వారిని హేళనగా మాట్లాడుతుండటం పరిపాటిగా మారింది. ఇక్కడ గత 100 సంవత్సరాలకు పైగా దిలాం లేబర్ క్వారీ సొసైటీ పేరుతో క్వారీయింగ్ జరుగుతోంది. దీనికి అధికారిక ఎన్నికలు నిర్వహించి అధ్యక్షులు, కార్యవర్గం ఎన్నిక ప్రక్రియ ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి జరుగుతోంది. అయితే ఈ కమిటీ ద్వారా సొసైటీకి ఎన్నికయ్యేంత బలం టీడీపీ నాయకులకు లేకపోవడంతో అడ్డదారుల్లో మైనింగ్ మాఫియాకు తెరలేపారు. తమ పొట్టు కొడుతుంటే అధికారులు పట్టించుకోవడం లేదంటూ క్వారీ సొసైటీ సభ్యులు కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఇటీవల అక్రమ మైనింగ్ నిలిపేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను మైనింగ్, విజిలెన్స్, రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల అధికారులకు కూడా అందజేయడంతో మైనింగ్‌ను నిలిపేయాలంటూ ఓ రెండు రోజులు నిలువరించారు. బుధవారం హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తూ టీడీపీ నాయకులు అక్రమ మైనింగ్‌కు పాల్పడటంతో మీడియా, సోషల్ మీడియా వేదికగా వ్యవహారం గుప్పుమంది. దీంతో చేసేదేమీ లేక అధికారులు ఉరుకులు పరుగులపై మైనింగ్‌ను నిలిపివేయించారు. టీడీపీ నాయకులు మాత్రం ఇది తాత్కాలికమేనని, తమను ఆపేది ఎవరంటూ ప్రగల్భాలు పలికారు. అర్ధరాత్రి అయినా బ్లాస్టింగ్ చేసి తరలిస్తాం... ఏం చేస్తారో చూస్తాం.. అంటూ ధిక్కారపు స్వరం వినిపిస్తున్నారు. సంబంధిత అధికారులు హైకోర్టు ఆదేశాలను అయినా సక్రమంగా అమలు చేస్తారా లేక టీడీపీ నాయకుల అడుగులకు మడుగులు ఒత్తుతారా.. అనేది వేచి చూడాల్సిందే.

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



మాట్లాడుతున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: నాయకుడిగా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా నాగయ్య అధ్యక్షతన వడ్డేశ్వరంలో నాయకులు, కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ కక్ష పూరిత రాజకీయాలు చేసే వ్యక్తి ఎప్పుడూ రాజకీయ నాయకుడు కాలేడన్నారు. అలాంటి పార్టీలు రాజకీయంగా మనుగడ కోల్పోతాయని తెలిపారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేయాలని కూటమి ప్రభుత్వం చూస్తోందన్నారు. ప్రశ్నించే వ్యక్తులపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని తెలిపారు. ఎంత క్లిష్ట సమయంలోనైనా కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరూ అధైర్యపడవద్దని పేర్కొన్నారు. గ్రామాలలో, మండలాల్లో నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేసి పార్టీలో నూతనోత్సాహం తేవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కాసినీడు బాజి గంగాధర్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

అన్నివిధాలా కాపాడుకుంటాం..

దుగ్గిరాల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మంచికలపూడి, తుమ్మపూడి, పెనుమూలి, కెఅర్ కొండూరు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ క్రియాశీలక కార్యకర్తలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. దొంతిరెడ్డి వేమారెడ్డి ముఖ్యఅతిథిగా కార్యకర్తలకు పార్టీ కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో కూటమి చర్యలను ప్రజలందరూ గమనిస్తున్నారని, పార్టీ కార్యకర్తలు ఎవరూ అధైర్య పడొద్దని భరోసానిచ్చారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందరికి అండగా ఉంటారని తెలిపారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తాడిబోయిన శివగోపయ్య, షేక్ జానీబాషా, ఎస్.నాగేశ్వరరావు, వై.ధనుంజయ్, నాగూర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక నగరంగా అమరావతి



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో మంత్రులు తదితరులు

దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి

తాడికొండ: సీఆర్డీయే పరిధిలోని టీటీడీ ఎస్వీ ఆలయంలో ఈ నెల 15న జరగనున్న శ్రీనివాస కల్యాణోత్సవంతో ఆధ్యాత్మిక నగరంగా అమరావతి మారనుందని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. గురువారం వెంకటపాలెంలోని టీటీడీ ఆలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, పలువురు మంత్రుల బృందంతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి ఆనం మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం నవ్యాంధ్ర రాజధానిలో టీటీడీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున టీటీడీ ఆలయాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారని గుర్తుచేశారు. మరోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక టీటీడీ ఎస్వీ ఆలయంలో అత్యంత వైభవంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం ఏర్పాటు చేయాలని నిర్ణయించి, అందుకు తగ్గట్టుగా టీటీడీ ఏర్పాట్లు చేపట్టిందన్నారు. శ్రీవారి ఆశీస్సులతో అమరావతి నగర నిర్మాణానికి వేగంగా అడుగులు వేసేందుకు నాంది పలుకనున్నారని, ఈ వేడుకలకు సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా హాజరుకానున్నారని, గవర్నర్ కుటుంబ సభ్యులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హైకోర్టు న్యాయమూర్తులు కూడా హాజరు కానున్నారన్నారు. సీఆర్డీయే పరిధిలోని 24 గ్రామాల కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఉన్నతాధికారులు కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు. శ్రీనివాస కల్యాణోత్సవానికి 15వ తేదీ మధ్యాహ్నానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. సభావేదిక ఏర్పాట్లు, వీఐపీ పార్కింగ్, రాకపోకలకు ప్రజలకు ఇబ్బంది కలుగకుండా తీసుకుంటున్న చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. టీటీడీ ఆవరణలో జరుగుతున్న ఏర్పాట్లను కూడా మంత్రుల బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, పనబాక లక్ష్మి, ఎం.శాంతారామ్, ఎంఎస్ రాజు, టీటీడీ ఈవో జె.శ్యామలరావు, డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, దేవదాయ శాఖ కార్యదర్శి వినయ్ చంద్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, టీటీడీ జేఈవో వి.వీరబ్రహ్మం, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గ్రామాలకు ఒకే పోస్టుమాన్



ఫిరంగిపురం పోస్టు ఆఫీసు



ఉత్తరాలు అందజేస్తున్న పోస్టుమాన్ శివకృష్ణ

ఫిరంగిపురం: మండల కేంద్రమైన కొత్తపేటలో పోస్టల్ కార్యాలయం ఉంది. దీని పరిధిలో 9 ప్రాంతాల్లో బ్రాంచి పోస్టు ఆఫీసులు అమీనాబాద్, కండ్రిక, కొండవీడు, నుదురుపాడు, చెంగిస్‌ఖాన్‌పేట, 113.తాళ్లూరు, లక్కరాజుగార్లపాడు, యర్రగుంట్లపాడు, వేమవరం ఉన్నాయి. ఫిరంగిపురం పోస్టు కార్యాలయంలో సబ్ పోస్టు మాస్టర్, పోస్టల్ అసిస్టెంట్, ఎంపీఎస్ (మల్టీ టాస్క్ స్టాఫ్), ఒక పోస్టు మాన్ విధులు నిర్వహిస్తుంటారు. సిబ్బంది సరిపడా లేక ఉత్తరాలు సమయానికి అందడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. ఉన్న ఒక్క పోస్టు మాన్ ఫిరంగిపురంలో కొత్తపేట, రసూల్‌పేట, రాజాపేట, తూర్పుబజారు, శాంతిపేట, విజ్ఞాన్‌పురం, ఎస్టీకాలనీ, ప్రకాశం పంతులు నగర్, రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతాల విధులు నిర్వర్తిస్తున్నారు. వాటితోపాటు రేపూడి, గొల్లపాలెం, అల్లంవారిపాలెం గ్రామాలకు కూడా ఉత్తరాలు బట్వాడా చేయాల్సి ఉంది. నిత్యం 200 - 250 వరకు పార్శిళ్లు, ఉత్తరాలు వస్తుంటాయి. ఆధార్ సేవలు అందించేందుకు నాలుగేళ్ల కిందట కేంద్రం ఏర్పాటు చేశారు. దానికి జీడీఎస్(గ్రామీణ డాక్ సేవక్)ను కేటాయించలేదు. శిక్షణ పొందిన కండ్రిక బ్రాంచి ఆఫీస్ సిబ్బంది ఒకరు కాసేపు పనిచేసి తన గ్రామానికి వెళ్లి అసలు విధులు నిర్వహిస్తున్నారు. దీనిపై సబ్ పోస్టు మాస్టర్ సందీప్ మాట్లాడుతూ.. ఉత్తరాల బట్వాడ విషయంలో తలెత్తే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులకు తెలియజేశామని, పరిశీలిస్తామన్నారని తెలిపారు.

సహాయనిధి చెక్కులు పంపిణీ

మంగళగిరి: మండలంలోని పెదవడ్లపూడిలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. గురువారం టీడీపీ నాయకుడు జువ్వాది కిరణ్ చందు ఆధ్వర్యంలో సాదు దుర్గాదేవికి,కొండపల్లి శ్రీలక్ష్మికి, మేదరమెట్ల వెంకటేశ్వరరావుకు సాయానికి సంబంధించిన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాష్ట్ర సివిల్ సప్లయిస్ డైరెక్టర్ తోట పార్థసారథి, యేళ్ళ శివరామయ్య, మాదల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు క్రీడలూ ముఖ్యం



మంగళగిరి టౌన్: పోలీస్ సిబ్బందికి వ్యాయామంతో పాటు క్రీడలూ అవసరం అని ఏపీఎస్పీ ఐజీపీ బి.రాజకుమారి తెలిపారు. గురువారం పట్టణంలోని 6 బెటాలియన్‌లో నిర్మించిన వాలీబాల్ కోర్టును రాజకుమారి ప్రారంభించారు. ఏపీఎస్పీ డీఐజీ డాక్టర్ కె.ఫకీరప్ప, కమాండెంట్ కె.నగేష్‌బాబు, అడిషనల్ కమాండెంట్ డి.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు తగవు



దుగ్గిరాల: మైనారిటీలను కించపరిచేలా ఆదోని ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని డిమాండ్ చేశారు. గురువారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్థసారథి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. అసెంబ్లీ సాక్షిగా ముస్లింలను కించపరుస్తూ ఎమ్మెల్యే మాట్లాడిన తీరు హేయమైన చర్య అన్నారు. సమావేశంలో షేక్ సుభాని, హుస్సేన్ సాహెబ్, షేక్ జిలాని బాషా పాల్గొన్నారు.

గురుకులంలో ఉచిత వైద్య శిబిరం

తాడికొండ: తాడికొండ ఏపీ గురుకుల పాఠశాలలో గురువారం గుంటూరు మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 152 మంది విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను సామాజిక వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణమ్మ వివరించారు. డాక్టర్లు రమ్య, ప్రతాప్ రెడ్డి, తేజ్ కుమార్, రవీంద్ర, శివ గోపాల్, నళిని, పాఠశాల ప్రిన్సిపల్ ఎం.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేస్తా



మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

ఫిరంగిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజల కోసం పనిచేస్తానని తాడికొండ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. మండలంలోని రేపూడి, గొల్లపాలెం గ్రామాల్లో గురువారం సాయంత్రం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక ఆటుపోట్లను తట్టుకొని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం జరిగిందన్నారు. పోరాటాలు పార్టీకి కొత్తకాదన్నారు. ప్రజా సంక్షేమం కోసం పార్టీ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా కనీవినీ ఎరుగని రీతిలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఐదేళ్ల పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఏదో ఒక సంక్షేమ పథకం అందినట్లు తెలిపారు. పేద విద్యార్థుల చదువుల కోసం ఏటా రూ.15 వేల ఇచ్చి వారి విద్యాభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేశారని తెలిపారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, చిట్టా అంజిరెడ్డి, దాసరి మెల్కియా, సయ్యద్ హబీబుల్లా, కె.చిన్నప్పరెడ్డి, చేవూరి రామమోహన్‌రెడ్డి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, పెరికల చిన్నా, ఆనంద్, వాసురెడ్డి, పి. వెంకట్రామిరెడ్డి, ఎస్,చిన్నా, సంగీతరావు, కె.ప్రవీణ్‌రెడ్డి, బ్రహ్మారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రామచంద్రస్వామి పట్టాభిషేకం



శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేకం జరిపిస్తున్న పండితులు

తెనాలి: స్థానిక కొత్తపేటలోని తాలూకా హైస్కూల్ గ్రౌండ్ వేదికగా అష్టోత్తర శతకోటి శ్రీరామనామ పారాయణ మహాయజ్ఞ పూర్ణాహుతి మహోత్సవాలు విశేషంగా కొనసాగుతున్నాయి. ఈనెల 14 వరకు నిర్వహించే ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా గురువారం, శ్రీ సీతారామచంద్రస్వామి పట్టాభిషేకం శాస్త్రోక్తంగా జరిపించారు. వైఖానస ఆగమ పండితులు నారాయణం గోవర్ధన్ లక్ష్మీ రఘురాం, వేదాంతం నాగమారుతి, రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, ఆర్‌వీ కిరణ్, సురేష్ బృందం వైదిక క్రతువును నిర్వహించింది. ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ శిల్ప భక్తుల నుద్దేశించి మాట్లాడారు. శ్రీసీతారాముల కళ్యాణం, శ్రీసీతారామచంద్రస్వామి పట్టాభిషేకం విశిష్టతను భక్తులకు తెలియజెప్పారు. సాయంత్రం ఏడు గంటలకు ప్రముఖ ప్రవచనకర్త, పద్మశ్రీ అవార్డుగ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనం భక్తులను ఆకట్టుకుంది. శ్రీరామనామ మహిమను శ్రీరాముడి ఔన్నత్యాన్ని ఆయన సోదాహరణంగా వివరించారు. రోజంతా జరిగిన కార్యక్రమాలకు బ్రహ్మశ్రీ ములుకుట్ల విశ్వనాధశర్మ వాఖ్యానం చేశారు. భగవద్ రామానుజ దాసుడు జంధ్యం రామారావు దంపతులు కార్యక్రమాల నిర్వహణకు భక్తిపూర్వక సహకారం అందించారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నప్రసాద వితరణను ఏర్పాటుచేశారు.

రెండు ఉన్నత పాఠశాలలకు 'రోటరీ' సేవలు

ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిస్ట్రిక్ట్ గవర్నర్



కళాకారులకు కళ్లజోళ్ల పంపిణీలో జయలక్ష్మి, రామప్రసాద్, బాలకోటిరెడ్డి

తెనాలి: పట్టణంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పలు సేవాకార్యక్రమాలను నిర్వహించారు. రోటరీక్లబ్ జూబ్లీ హిల్స్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం సంయుక్తంగా బీజీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వారి సీఎస్సార్ నిధులతో స్థానిక అయితానగర్‌లోని ఎస్‌ఎస్‌ఎస్ మున్సిపల్ హైస్కూలులో మంచినీటికోసం ఏర్పాటుచేసిన బోరు, మోటారును ప్రారంభించారు. బీరువాలను బహూకరించారు. అనంతరం కొత్తపేటలోని మున్సిపల్ బాలుర హైస్కూలులో డైనింగ్ హాలు ఆధునికీకరణను ప్రారంభించారు. రోటరీ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ సోమవరపు రామప్రసాద్, జూబ్లీ హిల్స్ రోటరీ అధ్యక్షుడు విసిరెడ్డి బాలకోటిరెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తెనాలి రోటరీ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఇదే సభలో ఇటీవల రోటరీ క్లబ్ తెనాలి, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా కళాకారుల కోసం నిర్వహించిన ఉచిత కంటివైద్యశిబిరంలో అవసరమైన 73 మందికి కళ్లజోళ్లను అందజేశారు. 'వీరస్థలి తెనాలి' డాక్యుమెంటరీలో నటించిన దర్శి జీవన్, గుంటుపల్లి వసంతయామినిలను సత్కరించారు. రోటరీ పాస్ట్ గవర్నర్లు అన్నే రత్న ప్రభాకర్, తాళ్ల రాజశేఖర్ రెడ్డి, స్కూల్ హెచ్ఎం మీరాబి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



తెనాలిఅర్బన్: పాఠశాలలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు అభినందనీయులని ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబి పేర్కొన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో పదోవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిల్‌లు, స్కేల్, హాల్‌టిక్కెట్ కవర్ వంటి వాటిని పంపిణీ చేశారు. సంఘం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్, కంకిపాటి రమేష్‌కుమార్, ఈఎల్‌వీ అప్పారావు, చుక్కా భానుప్రసాద్, కెకె శ్రీనివాస్, శివభాస్కర్, సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

రుణాల కోసం 22లోపు దరఖాస్తు చేసుకోండి

దుగ్గిరాల : కార్పొరేషన్ ద్వారా వ్యక్తిగత రుణాల కోసం ఈ నెల 22వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎ.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో బీసీ, మైనార్టీ, ఈబీసీ, కాపు, బలిజ, తెలగ, ఒంటరి, కమ్మ, రెడ్డి, వైశ్యాస్, బ్రాహ్మణ, క్షత్రియ కులాలకు సంబంధించిన వారు ఉన్నారని తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు పొందాలి

తాడికొండ: 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల నిర్వహణాధికారి ఎం.గంగరాజు సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. దరఖాస్తుల్లో పెండింగ్ వాటిని సకాలంలో విచారించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మెహర్ బాబు, పలు పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల బకాయిలు వెంటనే చెల్లించాలి



మంగళగిరి: రాష్ట్రంలో కాంట్రాక్టర్ల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోషియేషన్ ఉపాధ్యక్షుడు ఐఎం మోహన్‌రెడ్డి కోరారు. మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట హ్యాపీ రిసార్ట్స్‌లో గురువారం కాంట్రాక్టర్స్ అసోషియేషన్ సమావేశం నిర్వహించారు. మార్చి చివర వస్తున్నా ప్రభుత్వం బకాయిలు చెల్లించడం లేదన్నారు. ప్రభుత్వం నుంచి బకాయిలు రాకపోవడంతో కాంట్రాక్టర్లు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. తాము ప్రభుత్వం చెప్పినట్లు గుంతలు పూడ్చామని, అయితే బిల్లులను సీఎంఎఫ్‌లో అప్లోడ్ అవ్వడం లేదన్నారు. అసోసియేషన్ నాయకులు ఎంపీపీ సూర్యప్రకాష్, కె.శివకుమార్, ఎన్.అప్పారావు, వరప్రసాద్ నాయుడు, డీపీ రెడ్డి, ఎ.నాగమల్లేశ్వరరావు, బి.రాఘవరావు, వి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.